# ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట

• అహ్మద్‌గూడలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి



లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు, ప్రజలు

మేడ్చల్, అక్టోబర్ 2 : 'సీఎం కేసీఆర్ నిరుపేదల సొంతింటి కల నిజం చేసిండు.. పేదల ఆత్మగౌరవ కోసం ఆయన డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి ఇచ్చిండు..' అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో 1845, అంబర్‌పేట నియోజకవర్గానికి 120 మంది లబ్ధిదారులకు కేటాయించారు. సోమవారం లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేసిన మంత్రి మల్లా రెడ్డి అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని నెంబర్‌వన్ స్థానంలో నిలిపారన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లను అన్ని వసతులతో నిర్మించి ఇచ్చారని చెప్పారు. దళిత బంధు, రైతుబంధు, బీసీ బంధు, కుల వృత్తులకు చేయూత, గృహలక్ష్మి కింద రూ.3లక్షల ఆర్థిక సాయం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజా సంక్షేమానికి సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు. గాంధీజీ కలలు కన్నట్టు రాష్ట్రంలో ఉన్న 12,769 గ్రామాల్లో అందంగా తీర్చిదిద్దారన్నారు. హరితహారం, ప్రకృతి వనాలతో పల్లెలు, పట్టణాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయన్నారు. విద్యా, వైద్యం మెరుగుపడిందన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వెయ్యి గురుకులాల్లో 6 లక్షల మంది విద్యార్థులకు చదువుతున్నారని తెలిపారు. గురుకులాల ద్వారా పేద విద్యార్థులకు ఆంగ్ల విద్యను అందిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలకు స్థానం లేదని, బీఆర్ఎస్‌కే ఓటు వేయడానికి ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు.

**ఇల్లు రాలేదని అధైర్య పడొద్దు..**

డబుల్ బెడ్‌రూం ఇండ్లు రాని వారు అధైర్య పడొద్దని మంత్రి చామకూర మల్లారెడ్డి సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ విడుతల వారీగా ఇండ్లు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. డబుల్‌బెడ్ రూం ఇండ్లల్లో 10 శాతం ఇండ్లను స్థానికులకు కేటాయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**సంబురంగా ఇండ్ల పట్టాల పంపిణీ**

అహ్మద్‌గూడలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాల పంపిణీ సంబురంగా జరిగింది. మల్కాజ్‌గిరి, అంబర్‌పేట నియోజకవర్గాల నుంచి లబ్ధిదారులు,వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. అధికారులు లబ్ధిదారులకు ఇబ్బంది కల్గకుండా కౌంటర్లను ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఇండ్లను కేటాయించారు. దూరం ప్రాంతాల నుంచి వచ్చే వారికి భోజన, రవాణా సదుపాయాలు కల్పించారు.

## బీఆర్ఎస్ నేతకు మంత్రి పరామర్శ



బీఆర్ఎస్ నాయకుడు కందాడి నరేందర్‌రెడ్డిని పరామరిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 2 : బీఆర్ఎస్ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్‌రెడ్డి సతీమణి కందాడి మాధవిరెడ్డి ఆదివారం రాత్రి మృతిచెందారు. విషయాన్ని తెలుసుకున్న కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సోమవారం ఉదయం వారి నివాసానికి వెళ్లి నరేందర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాధవిరెడ్డి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా సోమవారం జరిగిన మాధవిరెడ్డి అంత్యక్రియల్లో చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ, మండలానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఘట్‌కేసర్‌కు మంత్రి మల్లారెడ్డి రాక

ఘట్‌కేసర్,అక్టోబర్ 2 : కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో మంగళవారం పర్యటించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనీజంగయ్యాయాదవ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు వార్డులలో నిర్వహించే సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

## ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 2 : జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గత నెల 17 నుంచి ఈనెల 2 వరకు నిర్వహించిన గ్రామసభలో జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కమ్యూనిటీ నిశ్చితార్థాన్ని ప్రోత్సహించడంలో పాటు జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, మాతాశిశు ఆరోగ్య సేవలు, వ్యాధుల నివారణ చర్యలు వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. అట్టడుగు స్థాయిలో కమ్యూనికేషన్, విద్యను పెంపొందించడం ద్వారా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆరోగ్యసంరక్షణ ప్రదాతల మధ్య సంబంధాలను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ సాయం



అవుషాపూర్‌లో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కొండల్‌రెడ్డి, తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 2 : నిరుపేద కుటుంబాలను మంత్రి మల్లారెడ్డి ఆదుకుంటున్నాడని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అవుషాపూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల జయమ్మ, బిట్ల రాములు, శంకరయ్య, నర్సింహ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకుని స్పందించిన మంత్రి మల్లారెడ్డి తన ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం పంపించారు. సోమవారం మృతుల కుటుంబసభ్యులకు బీఆర్ఎస్ నాయకుడు కొండల్‌రెడ్డి నగదును అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా సభ్యులు భిక్షపతిగౌడ్, ఉపసర్పంచ్ అయిలయ్యాయాదవ్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి,మాజీ సర్పంచ్ రమేశ్, పంచాయతీ సభ్యులు శ్రీనివాస్, వీరేశం, రాయల్‌రాజ్ పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

• కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి


మేడ్చల్ జోన్ బృందం, అక్టోబర్ 2 : గాంధీ మహాత్ముడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర పోరాటంలో ఆయన పోషించిన పాత్రను గుర్తుకు చేసుకున్నారు. తూంకుంట మున్సిపాలిటీలో గాంధీజీ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని నివాళులర్పించారు. శామీర్‌పేట మండలం మురహరిపల్లిలో ఏర్పాటు చేసిన గాంధీ, వివేకానంద, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి పల్లెలు పట్టుకొమ్మలన్నారు. గాంధీజీ ఆశయసాధన అయిన గ్రామాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారని అన్నారు. పోచారం మున్సిపాలిటీలో జరిగిన గాంధీ జయంతితో అడిషనల్ కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య పాల్గొన్నారు.



మురహర్‌పల్లిలో గాంధీ, అంబేద్కర్, వివేకానందుడి విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి మల్లారెడ్డి



పోచారంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్యాయాదవ్, కమిషనర్ సాబేర్ అలీ

# రాష్ట్రంలో గురుకుల పాఠశాలల ప్రగతి అపూర్వం



జిల్లాస్థాయి క్రీడాపోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న సికింద్రాబాద్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ రాజేశ్

కీసర, అక్టోబర్ 2; తెలంగాణలో గురుకుల పాఠశాలల ప్రగతి ఆపూర్వమని సికింద్రాబాద్ వేంకటేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేశ్ తెలిపారు. కీసర మండలం భోగారం మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ఈఓ రాజేశ్ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో అనేక గురుకుల పాఠశాలలనే స్థాపించి విద్యార్థుల చక్కటి భవిష్యత్‌కు పునాదులు వేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని కొనియాడారు. గురుకుల పాఠశాలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. విద్యార్థులు విద్య, క్రీడల్లో మెరుగ్గా రాణించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్‌కు చక్కటి పునాదులు వేస్తున్న సీఎం కేసీఆర్‌కు విద్యార్థి లోకమంతా రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కీసరగుట్ట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజన్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రేణుక, ఏటీఎం సోమేశ్, డీబ్ల్యూ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకుడు అరెస్టు

పీర్జాదిగూడ, అక్టోబర్2: మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పీర్జాదిగూడ పరిధిలో ఉంటున్న బాలిక(6)ను సోమవారం మధ్యాహ్నం స్థానికంగా ఓ జిమ్‌లో పని చేస్తున్న యువకుడు మాయమాటలతో జిమ్‌లోకి తీసుకుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంటికి వాచ్‌మెన్‌గా పని చేస్తున్న ఆమె తల్లిదండ్రులు ఇంటికి రాగానే బాలిక కలిపించకపోవడంతో పరిసర వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో అనుమానంతో జిమ్ వద్దకు వెళ్లి చూడగా బాలిక కనిపించింది. బాలిక జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని అత్యాచార నిరోధక చట్టం(ఫోక్స్) కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.